క్లుప్తంగా

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు



తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో మురుగు సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి పేర్కొన్నారు. పట్టణంలోని 7,19,38 వార్డులలో గురువారం ఉదయం ఆయన పర్యటించారు. మురుగు కాల్వల పూడికతీత పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కాల్వల్లో వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. ఎక్కడ మురుగు పారుదల నిల్వకుండా చూడాలని చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

30న సర్వసభ్య సమావేశం

కొల్లిపర: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 30న ఎంపీపీ పద్మావతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొని, గ్రామాల్లోని సమస్యలు తెలియజేయాలని కోరారు.

ఏకగ్రీవంగా టీఎంసీఏ నూతన కార్యవర్గ ఎన్నిక



తెనాలి రూరల్: ది తెనాలి మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికను గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా డాక్టర్ ఘంటా నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ కొత్తమాసు శ్యామ్‌ప్రసాద్, కార్యదర్శిగా డాక్టర్ కె. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా డాక్టర్ జి. కోటేశ్వరప్రసాద్, కోశాధికారిగా డాక్టర్ కె. శివరామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక బోస్ రోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో జరిగిన ఎన్నికలకు అధికారులుగా డాక్టర్ వి. శేషగిరిరావు, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ ఎం.వి. సత్యనారాయణ వ్యవహరించారు.

విద్యుత్ బిల్లుల దహనం



తెనాలి అర్బన్: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం తెనాలి శాఖ ఆధ్వర్యంలో గురువారం రాత్రి సుందరయ్య కాలనీలో బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించి విద్యుత్ బిల్లులను పెంచిందని ఆరోపించారు. ప్రజల్లో దీనిపై చైతన్యం తెచ్చేందుకు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వెంటనే ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.భావన్నారాయణ, కొల్లిపర బాబూప్రసాద్, కె.రవి కుమార్, పి.యేసోబు పాల్గొన్నారు.

అమిత్‌షాపై కఠిన చర్యలు తీసుకోవాలి

తెనాలి అర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక నాయకులు అక్కిదాసు కిరణ్‌కుమార్, యాతాటి అనిల్, బండ్లమూడి నాని, ఉన్నవ సల్మాన్, అక్కిదాసు బాబు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి దళితులను చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు.భారతదేశానికి అతిపెద్ద రాజ్యాంగం అందించిన అంబేడ్కర్‌ను అవమానకరంగా మాట్లాడటం బాధకరమని పేర్కొన్నారు. సుప్రీమ్ కోర్టు వెంటనే జోక్యం చేసుకుని మంత్రివర్గం నుంచి అమిత్‌షాను తొలగించాలని డిమాండ్ చేశారు. దళిత జాతికి ఆయన క్షమాపణ చెప్పాలని కోరారు.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్

తెనాలి రూరల్: 'మల్లెపాడులో నిలిచిపోయిన నిర్మాణాలు' పేరిట గురువారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో బేస్‌మెంట్ వరకు నిలచిపోయిన ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాల నిర్మాణాలను ప్రభుత్వ తదుపరి ఉత్తర్వుల ప్రకారం ప్రారంభించి పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ జి. బ్రహ్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ప్రధాన రోడ్డుకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసే పనులను గ్రామ పంచాయతీలోని నిధుల లభ్యత మేరకు చేపట్టాల్సి ఉందని వివరించారు.

ఆధునిక యంత్రం.. రైతు తంత్రం

- హ్యాండ్ పుష్ సీడర్ ద్వారా చకచకా మొక్కజొన్న, జొన్న నాట్లు
- రైతులకు తక్కువ ఖర్చు
- ఒకరు, ఇద్దరు కూలీలతో పని పూర్తి



హ్యాండ్ పుష్ సీడర్ యంత్రం

కొల్లిపర: కాలం మారుతున్న కొద్దీ రైతుల కోసం మార్కెట్లో ఆధునిక యంత్రాలు వస్తూనే ఉన్నాయి. సాగులో పెట్టుబడులతో సతమతమవుతున్న రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం మొక్కజొన్న , జొన్న సాగు చేయాలంటే కూలీలతో విత్తనాలను నాటించాల్సి ఉంది. ఎకరానికి ట్రాక్టర్ ద్వారా మొక్కజొన్నకు బెజ్జాలు వేయటానికి రూ.1000, విత్తనాలను నాటడానికి రూ.1300, జొన్నకి రూ. 1400 కూలీలు తీసుకుంటున్నారు.దీంతో ఎకరానికి రూ. 2500 నుంచి రూ. 3000 ఖర్చు అవుతుంది.



హ్యాండ్ పుష్ సీడర్ ద్వారా మొక్కజొన్న విత్తుతున్న రైతులు

దీనికి గింజలు ఖర్చు అదనం కావడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా మార్కెట్లోకి హ్యాండ్ పుష్ సీడర్ అనే నూతన యంత్రం వచ్చింది. దానికి ఉన్న పెట్టెలో మొక్కజొన్న విత్తనాలను పోసి పొలంలో ముందుగా ఏర్పాటు చేసిన లైన్ ప్రకారం ఒక వ్యక్తి తోసుకుంటూ వెళ్లాలి. యంత్రానికి ఉన్న సన్నని ఇనుప గొట్టం ద్వారా నేలలో రంధ్రం పడి అందులో విత్తనాలు పడతాయి. ఇలా ఇద్దరు లేదా ఒక్కరూ కలసి యంత్రం ద్వారా ఎకరం రెండు, మూడు గంటల సమయంలోనే జొన్న, మొక్క జొన్న విత్తనాలను నాటుతున్నారు. రైతు యంత్రాన్ని అద్దెకు తీసుకుని, వ్యక్తి ఒక రోజు కూలీ రూ.700 వరకు ఇచ్చి విత్తనాలు విత్తుకోవచ్చు. యంత్రం ఉన్న వారు ఇద్దరు వ్యక్తులను పెట్టుకుంటే ఎకరానికి రూ.1400 తీసుకుని విత్తనాలు నాటుతున్నారు. రోజుకు ఇద్దరు వ్యక్తులు కలసి మూడు ఎకరాలల్లో గింజలు నాటవచ్చు. మండలంలో ప్రస్తుతం కొల్లిపరలో రైతులు ఈ యంత్రాల ద్వారా మెట్ట, మాగాణి పొలాల్లో మొక్కజొన్న, జొన్నను నాటు తున్నారు. మార్కెట్‌లో యంత్రం ధర రూ.7వేల వరకు ఉంది.

ఘనంగా కాకుమాను శంకరుని 108వ వర్ధంతి

- 100 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు
- 600 మంది పేదలకు దుప్పట్ల పంపిణీ, అన్నదానం



విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని కాకుమాను శంకరుని ధర్మసత్రం వ్యవస్థాపకుడు, ప్రముఖ దాత కాకుమాను శంకరుని 108వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. దాత ఆశయం ప్రకారం ఏటా ఆయన వర్ధంతి రోజున అన్నదానం, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.శారదాదేవి సమక్షంలో ధర్మసత్వరం కార్యనిర్వహణాధికారి తమ్మా శివారెడ్డి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకారవేతనాలను పంపిణీ చేశారు. మొత్తం 100 మంది విద్యార్థిని, విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున రూ.2 లక్షల నగదును అందజేశారు. పేదలు 600 మందికి దుప్పట్లను పంపిణీ చేసి, తదుపరి అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని సత్రం వ్యవస్థాపక కుటుంబసభ్యుడు కాకుమాను శరత్ బాబు పర్యవేక్షించారు. దేవదాయశాఖ, ధర్మసత్రం సిబ్బంది పాల్గొన్నారు.

పీడితుల అభ్యున్నతికి రాజీలేని పోరు

దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం ప్రథమ వర్ధంతి సభలో వక్తల నివాళి



దళిత ఘోష పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చల్లపల్లి స్వరూపరాణి తదితరులు

కొల్లిపర(తెనాలి): పీడితుల అభ్యున్నతికి రాజీలేని పోరుతో పాటు వారి అభ్యున్నతి కోసం జీవితమంతా కృషిచేసిన ఆర్గానిక్ ఇంటలెక్చువల్ కనపర్తి ఏసురత్నం మృతి ఉద్యమానికి తీరనిలోటని ప్రముఖ రచయిత్రి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. ఏసురత్నం వంటి మేధావుల అవసరం నేడు దళిత ఉద్యమానికి ఎంతగానో ఉందన్నారు. దళిత ఉద్యమనేత కొల్లిపర ఏసురత్నం ప్రథమ వర్ధంతి సభను గురువారం ఆయన స్వస్థలమైన కొల్లిపరలో నిర్వహించారు. 'అరసం' నేత కనపర్తి బెన్‌హర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. 'కార్డ్' డైరెక్టర్ డాక్టర్ ఎం.స్వర్ణలతాదేవి మాట్లాడుతూ కమ్యూనిస్టుగా ఉద్యమ జీవితం ప్రారంభించిన ఏసురత్నం, దళిత ఉద్యమకారుడిగా పోరాటం, అధ్యయనం రెండుకళ్లుగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తుశారు. ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని, అనుసరణీయమని చెప్పారు. సభలో వివిధ రంగాల ప్రముఖులు, దళిత మేధావులు ఏసురత్నంతో తమకు గల అనుబంధాన్ని, ఉద్యమకారుడిగా ఆయన పోరాటపటిమను స్మరించుకున్నారు. ఇదే సభలో డాక్టర్ పూర్ణప్రజ్ఞాచారి రాసిన దీర్ఘకవిత 'దళిత ఘోష'ను డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి ఆవిష్కరించారు. వీసీకే పార్టీ నేత ఎన్‌జే విద్యాసాగర్, దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, 'భారత్ బచావో' నాయకుడు వేము సమత, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, అంబేడ్కరైట్ యండ్రపాటి అశోక్‌కుమార్, ఏఎన్‌యూ అంబేడ్కర్ చైర్ డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్, సంగీతరావు మాట్లాడారు. తొలుత ఏసురత్నం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

ఎన్‌సీసీ విద్యార్థులు విరాళాల సేకరణ



హెచ్‌ఎం మౌలాబీ నుంచి విరాళం సేకరిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థినులు

తెనాలి అర్బన్: నేషనల్ ఫౌండేషన్ ఫర్ కమ్యూనల్ హార్మోని వీక్‌లో భాగంగా 22 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎ.ఉదయ్‌కుమార్ ఆదేశాల మేరకు కొత్తపేట మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లోని ఎన్‌సీసీ విద్యార్థులు గురువారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబీ మాట్లాడుతూ హింసకు గురైన నిరుపేద పిల్లలను ఆదుకునేందుకు విరాళాలు సేకరించినట్లు తెలిపారు. సేకరించిన రూ.5,308 నగదును నేషనల్ ఫౌండేషన్ ఫర్ కమ్యునల్ హార్మోన్ సంస్థకు అందజేయనున్నట్లు చెప్పారు. విరాళాలు సేకరించిన విద్యార్థులను ఆమెతో పాటు ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్, ఉపాధ్యాయులు అభినందించారు.

సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్: నగర దీపికలు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. పట్టణంలోని 2వ శానిటరీ డివిజన్‌లో గురువారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఎక్కడా చెత్త కనపడకూడదని సూచించారు. శివాజీ చౌక్‌లో ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ముందుగా శానిటేషన్ కార్యాలయానికి వెళ్లి అటెండెన్స్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల ప్రక్షాళన

అత్తోట(కొల్లిపర): భూ సమస్యల ప్రక్షాళనకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జి.సిద్ధార్థ సూచించారు. మండలంలోని అత్తోటలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ భూముల ఆన్‌లైన్, కొత్త పాస్ పుస్తకాల మంజూరు, భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాన్ని సరి చేసేందుకు రైతులు అర్జీలు అందజేస్తే నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని తెలిపారు. సదస్సులో రైతుల నుంచి రెవెన్యూ సమస్యలపై ఎనిమిది, ఎఫ్ లైన్ సమస్యలపై 10 అర్జీలు వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ వంశీకృష్ణ, వీఆర్వో బాషా, రైతులు పాల్గొన్నారు.

గుడివాడలో రెవెన్యూ సదస్సుకు 12 అర్జీలు

తెనాలి రూరల్: మండలంలోని గుడివాడలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 12 అర్జీలు వచ్చాయి. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తహసీల్దార్ కె.వి. గోపాలకృష్ణ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామంలోని శివాలయం అభివృద్ధి విషయంలో ఈవో సహకరించడం లేదన్న గ్రామస్తుల ఫిర్యాదును జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళతామని ఆయన తెలిపారు మ్యుటేషన్ కోసం ఐదు, సర్వే కోసం ఐదు, దేవదాయ శాఖకు సంబంధించి రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వివరించారు. రైతుల భూముల సమస్యలను త్వరిత గతిన పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యడ్లపాటి రాకేష్, దేవదాయ శాఖ ఈవో హరిప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నింగి నుంచి నేలకు దిగి వచ్చిన నక్షత్రం



పట్టణంలో ఎక్కడ చూసినా క్రిస్మస్ సందడి కన్పిస్తోంది. క్రీస్తు పుట్టుకకు నిదర్శనంగా క్రైస్తవులు భావించే భారీ నక్షత్రాన్ని అమరావతి ప్లాట్స్‌లో ఏర్పాటు చేశారు. రాత్రిపూట కాంతులు విరజిమ్ముతూ చూడముచ్చటగా కన్పిస్తోంది.

– తెనాలి అర్బన్

రెచ్చిపోతున్న చిల్లర దొంగలు

కారు అద్దం పగలగొట్టి ఎల్‌ఈడీ సెట్ అపహరణ



పగలకొట్టిన కారు అద్దం



చోరీకి గురైన ఎల్‌ఈడీ స్క్రీన్

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రోజురోజుకి చిల్లర దొంగతనాలు ఎక్కువై ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బకింగ్ హామ్ కెనాల్ రైల్వే బ్రిడ్జి వద్ద ఇంటి ముందు సూరగాని రవికుమార్ తెల్లవారుజామున రెండు గంటల సమయంలో కారు పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లాడు. ఉదయం 8 గంటలకు కార్ క్లీన్ చేద్దామని వచ్చే సరికి.. కారు డిక్కీ పక్కనే ఉన్న విండో అద్దం పగలగొట్టి ఉంది. లోపలకు దూరి కారులో ఉన్న ఎల్‌డీఈ స్క్రీన్ దొంగిలించారు. ఎల్ఈడీ స్క్రీన్ రూ.30 వేలు, కొత్త అద్దం, ఇతర సామగ్రితో కలిపి మరో రూ.20 వేలు అవుతుందని బాధితుడు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున జేవీ చికెన్ సెంటర్ కోళ్లు సరఫరా లారీలో బ్యాటరీ చోరీ చేయడం, మరునాడే మరో ఘటన జరగడంతో తాడేపల్లి ప్రాంత వాసులు భయాందోళనకు లోనవుతున్నారు. పోలీసులు గస్తీ పెంచాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పురుగు మందు తాగి ఆత్మహత్య

తాడికొండ: ఆర్థిక సమస్యలతో పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బండారుపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జోలాపురి శంకరావు (45) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక సమస్యలు పెరిగిపోవడంతో బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సాయంతో అతనిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడు భార్య జోలాపురి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జోజి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

ఏసుక్రీస్తు జీవితం ఆదర్శనీయం

నెహ్రూనగర్: ఏసుక్రీస్తు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అన్నారు. గురువారం రాత్రి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధ్యక్షత సెమిక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మేయర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన బాట నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి ఏటా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్, రంజాన్, సంక్రాంతి, బక్రీదు పండుగులు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం క్రిస్మస్ కేకట్ చేశారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, డెప్యూటీ మేయర్ సజిల, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలి రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు నరకాల్సి ఉండడంతో తెనాలి పట్టణంలోని సుల్తానాబాద్, సుదరయ్యనగర్, ఆలపాటి నగర్‌లలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నేడు, రేపు మెప్మా అర్బన్ మార్కెట్ ఏర్పాటు

తెనాలి అర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని మెప్మా విభాగం ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం సహాయ సంఘ సభ్యులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులు, పిండి వంటలను అమ్మకాలు జరపనున్నట్లు పేర్కొన్నారు. మహిళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంలో నెలలో రెండు రోజులు మున్సిపల్ కార్యాలయం ముందు దీనిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ వస్తువులను కొనుగోలు చేసిన మహిళల వ్యాపారాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు పెరిగిన ప్రాధాన్యత



తెనాలి అర్బన్: నేడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాధాన్యత పెరిగిందని, దానిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. రోబో వింగ్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో స్కూలులో గురువారం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్ వైజ్ఞానిక పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రోబోటిక్ టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు వి.నాగవెంకట సాయిరాం, షేక్ సాజిద్ పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్ హామీ అమలు చేయాలి



తాడేపల్లిరూరల్ : ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి తాడేపల్లిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో సీపీఎం తాడేపల్లి రూరల్ కమిటీ సమావేశం కాజా వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. రామారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ముఖ్యంగా వేలాది మంది ఇళ్ల పట్టాలు లేక ఇబ్బంది పడుతున్నారని, అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలతో పాటు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తాడేపల్లి రూరల్ గ్రామాల్లో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని, గ్రామాల్లో మురుగు పారే సదుపాయం లేక దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, మలేరియా డెంగీ లాంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి వీధిలో మద్యం ఏరులై పారుతోందని, తాము అధికారంలోకి వస్తే మద్యాన్ని నియంత్రిస్తామని చెప్పిన హామీలు అమలు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, ఎం. కిషోర్, కె.యశోద, కె. సాంబశివరావు, జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్ల పంపిణీలో తహసీల్దార్ గోపాలకృష్ణ, రోటరీ సభ్యులు

తెనాలి: రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా మహిళలకు గురువారం కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం తోడ్పడాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ సేవకు, హైదరాబాద్‌లోని బీజీఆర్ మైనింగ్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ సీఎస్సార్ నిధుల నుంచి ఆర్థికసహకారం అందజేసింది. రోటరీ కార్యాలయంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు వారి కాళ్ల మీద నిలబడి కుటుంబానికి అండగా ఉండాలనే భావనతో కుట్టుమిషన్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ లబ్ధిదారులను పరిచయం చేశారు. రోటరీ నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నల్లూరి వెంకటేశ్వర్‌రావు పర్యవేక్షించిన కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్ ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, డాక్టర్ దూళిపాళ్ల రవీంద్రనాథ్, సభ్యులు పావులూరి రాంబాబు, గుమ్మడి వెంకటనారాయణ, కొల్లి రాజేంద్రప్రసాద్, కాకుమాను ఉపేంద్ర, ఆలపాటి కిరణ్, అర్జున్, మహేష్ పాల్గొన్నారు.

చెయ్యి ఎత్తినా ఆగని బస్సులు

డయల్ యువర్ డీఎంలో పలువురు ఫిర్యాదులు



కార్యక్రమంలో పాల్గొన్న మేనేజర్ రాజశేఖర్

తెనాలి అర్బన్: చెయ్యి ఎత్తినా కొందరు డ్రైవర్లు బస్సులు ఆపడంలేదని, ఆపే విధంగా చూడాలని తెనాలికి చెందిన రవికుమార్ కోరారు. డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తెనాలి నుంచి చిలువూరు మీదుగా విజయవాడకు బస్సు సౌకర్యం కల్పించాలని అన్నవరానికి చెందిన మధుసూదనశర్మ, పెదపలకలూరు మీదుగా పేరేచర్ల మీదకు బస్సు ఏర్పాటు చేయాలని గంగాధర్ కోరారు. తెనాలి నుంచి గుంటూరుకు నాన్‌స్టాప్ బస్సులు ఏర్పాటు చేయాలని ఎన్.ప్రసాద్, తెనాలి నుంచి జగ్గారెడ్డిగూడెం మీదుగా ద్వారక తిరుమలకు బస్సు ఏర్పాటు చేయాలని గంగాధర్ కోరారు. వీటన్నిటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ తెలిపారు.

కేఎల్‌యూలో భౌతిక శాస్త్రంపై అంతర్జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసిన కేఎస్ జగన్నాథరావు, కె.స్వప్న, కృష్ణారెడ్డి, ఎస్. షణ్ముగన్

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ సదస్సు ఘనంగా నిర్వహించారు. ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు, సదస్సు చైర్మన్ డాక్టర్ కె.స్వప్న, ఎఫ్ఈడీ ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సుకు దేశ విదేశాలకు చెందిన పలువురు భౌతిక శాస్త్రవేత్తలు పాల్గొని ప్రసంగించారు. ముఖ్య అతిథులుగా ఇజ్రాయేల్‌లోని ఎరియల్ యూనివర్సిటీ పరిశోధకుడు డాక్టర్ కె.చిన్నయ్య, అమెరికా నుంచి జాలాది ప్రసాద్ పాల్గొన్నారు. సదస్సు చైర్మన్ డాక్టర్ కె.స్వప్న మాట్లాడుతూ విద్యుత్ నిల్వలకు నానో టెక్నాలజీ సామర్థ్యం, మెరుగు పరచడంపై పరిశోధనలు.. దానిపైన చర్చలను ప్రోత్సహించడం ఈ సదస్సు లక్ష్యమని తెలిపారు. నానో టెక్నాలజీ పాత్రపై దృష్టి సారించడం ద్వారా అధునాతన సూక్ష్మ పదార్థాలను ఉపయోగించి, బ్యాటరీలు, సూపర్ కెపాసిటర్లు వంటి విద్యుత్ నిల్వ వ్యవస్థల పనితీరు మరింత స్థిరమైన శక్తి నిల్వ పరిష్కారాలకు దోహదపడే ఆవిష్కరణలను నడపడం ప్రధాన ఉద్దేశమన్నారు. కన్వీనర్ డాక్టర్ షణ్ముగన్ మాట్లాడుతూ ప్రపంచ ఇంధన సవాళ్లను పరిష్కరించేటప్పుడు పర్యావరణంపై దుష్ఫలితాల ప్రభావాన్ని తగ్గించే స్థిరమైన సూక్ష్మ పదార్థాలను అభివృద్ధి చేయడంపై గురించి అవగాహన కల్పించారు. వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, ఎఫ్‌డీఈ ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణారెడ్డి, ఆర్అండ్‌డీ డీన్ మాధవ్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి



తాడికొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బత్తుల కిషోర్, జిల్లా నాయకులు నాయుడు నాగేశ్వరరావు అన్నారు. గురువారం తుళ్లూరులో నిర్వహించిన గ్రామపార్టీ సమావేశం నిర్వహించారు. గతంలో ఉన్న పార్టీ పదవులన్నీ రద్దయినందున కొత్త కమిటీల ఎంపిక నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు ఆధ్వర్యంలో జరగనుందన్నారు. పదవులు ఎంపిక విషయంలో ఏకాభిప్రాయ నిర్ణయం ఉంటుంది.. కనుక కార్యకర్తలు నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబును సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. 21న వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.